ప్రజాశక్తి
బుధవారం 28 ఫిబ్రవరి 2024 5
పార్వతీపురం మన్యం

కమిషనర్‌కు బదిలీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కమిషనర్ పొందూరు సింహాచలంకు బదిలీ అయ్యింది. ఈనెల 2న విధుల్లోకి చేరిన సింహాచలం చీరాల మున్సిపల్ కార్యాలయానికి బదిలీ అయినట్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ డెవలప్మెంట్ కార్యాలయం నుండి ఆదేశాలు వచ్చాయి. సింహాచలం స్థానంలో నిడదవోలు మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కోన శ్రీనివాస్ ఇక్కడి మున్సిపల్ కమిషనర్‌గా త్వరలో బాధ్యతలు చేపట్టబోతున్నట్లు అధికారిక సమాచారం.

కిలో రూ. 80కు కొనుగోలు చేయాలి

ఈ ఏడాది గిరిజన సహకార సంస్థ కిలో చింతపండు ధర రూ.80కు నిర్ణయించి గిరిజనుల వద్ద నుంచి కొనుగోలు చేయాలి. ప్రతి వారపు సంతలోనూ, గ్రామంలోనూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిరిజనుల వద్ద నుంచి నేరుగా చింతపండు కొనుగోలు చేయాలి.

కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం
జిల్లా కార్యదర్శి

నిబంధనలు సరికావు

గిరిజనుల నుంచి చింతపండు కొనుగోలు చేస్తున్న గిరిజన సహకార సంస్థ పలు నిబంధనలు పెట్టడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. పండు సేకరణలో నాణ్యత లేదని, తడిపి తీసుకు వస్తున్నారని అధికారులు చెప్పడంతో తక్కువ ధరకే వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తుంది. గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన జిసిసి ద్వారా గిరిజనులు సేకరించిన అన్ని రకాల అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలి.

మండంగి రమణ,
ఆదివాసీ గిరిజన సంఘం
జిల్లా కోశాధికారి

గిరిజనులకు చింతేనా?

- చింతపండు దిగుబడి అంతంత మాత్రమే
- జిసిసి ధర కేజి రూ.32.40 పైసలు
- కొనుగోలు ధర రూ.80కి పెంచాలని గిరిజన సంఘం డిమాండ్
- మద్దతు ధర లేక ఏటా నష్టపోతున్న గిరిజనులు

గిరిజనులు సేకరించిన చింతపండు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలో గిరిపుత్రులు తరతరాల నుంచి అడవినే నమ్ముకొని పోడు వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రతి ఏటా పండే ప్రధాన పంటలైన చింతపండు, జీడిపై ఎక్కువ శాతం ఆధారపడుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి వచ్చినా చింత పంట దిగుబడి ఆశాజనకంగా లేకపోవడంతో గిరిజనులు తీవ్ర నిరాశతో ఉన్నారు. ఖరీఫ్‌లో ఎక్కువ వర్షాలు, చలి తీవ్రత కారణంగా ఫిబ్రవరి వచ్చినా చింతపండు దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. చింతపండు సేకరణ కోసం పిల్లాపాపలతో కొండలు, గుట్టలపై ఉన్న చింత చెట్ల వద్దకు వెళ్లి ఎంతో కష్టపడి చింత బొట్టలను సేకరించి, తొక్కలు తీసి అమ్మకాల కోసం కిలోమీటర్లు కాలినడకన మండల కేంద్రానికి, వారపు సంతలకు, జిసిసి ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తుంటారు. ప్రతి ఏటా చింతపండు సేకరణలో వ్యయ ప్రయాసలు పడుతున్న గిరిజనులకు గిట్టుబాటు ధర లేక.. చివరకు చేసేది లేక తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుంది. మరోవైపు జిసిసి నిబంధనలు గిరి పుత్రులకు ఆందోళన కలిగిస్తున్నాయి. జిసిసి కొనుగోలు కేంద్రాలకు చింతపండు అమ్మకానికి తీసుకొస్తే నాణ్యత, పొడిగా లేదని, తడిచిన చింతపండు తీసుకొచ్చారని సిబ్బంది నిబంధనలతో ఇబ్బంది పెడుతున్నారు. దీంతో గత్యంతరం లేక చివరి నిమిషంలో వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. జిసిసి కిలో చింతపండు రూ.32.40 పైసలు ధర నిర్ణయించి కొనుగోలు చేయడంతో గిరిజనుల్లో నిరాశ నెలకొంది.

పదివేల క్వింటాళ్ల దిగుబడి

జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియమ్మవలస, కొమరాడ, పాచిపెంట, మక్కువ, సీతంపేట, భామిని మండలాల్లో 70వేలకు పైగా చింత చెట్లు విస్తారంగా ఉన్నాయి. ప్రతి ఏటా పదివేల క్వింటాళ్ల వరకు చింతపండు దిగుబడి వస్తోందని అంచనా. గిరిజనులు సేకరించిన చింతపండును గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేస్తుంది. అనంతరం టెండర్లు పిలిచి వర్తకుల ద్వారా మైదాన ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. జిసిసికి జిల్లాలో కోల్డ్ స్టోరేజ్ లేకపోవడంతో పంట నిల్వలను ఇతర ప్రాంతాల్లో భద్రపరచాల్సిన పరిస్థితి నెలకొంది. జిసిసి నెల నెలా టన్నులు లెక్కన అద్దె చెల్లించాల్సి వస్తోంది. ఏటా గిరిజనులు సేకరిస్తున్న చింతపండుకు టెండర్లు పిలుస్తున్నప్పటికీ జిసిసి కొనుగోలు చేస్తున్న ధర రావడం లేదు. గత ఐదేళ్లలో 18,590 కింటాళ్ల చింతపండు కొనుగోలు చేస్తే, ఇప్పటి వరకు 11,357 క్వింటాళ్లు మాత్రమే అమ్మకాలు జరిగాయి. 7,233 క్వింటాళ్లు చీపురుపల్లి కోల్డ్ స్టోరేజ్‌లో చింతపండు నిల్వచేసి ప్రతి ఏటా రూ.7 లక్షలు అద్దె చెల్లిస్తుంది. దీంతో ఆ సంస్థ పూర్తిస్థాయిలో కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. నాణ్యత లేదని, తడిపిన చింతపండు తీసుకొస్తున్నారని రకరకాల కారణాలు చూపుతూ అంతంతమాత్రంగానే అధికారులు కొనుగోలు చేస్తున్నారని గిరిజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

తప్పని దళారుల బెడద

గిరిజనులు సేకరిస్తున్న చింతపండు నాణ్యత లేదని జిసిసి అధికారులు కొనుగోలు చేయకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించి తక్కువ ధరకే పంట మొత్తాన్ని అమ్ముకోవాల్సి వస్తోంది. గిరిజనుల నుంచి చింతపండు కొనుగోలు చేసిన వర్తకులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచి మంచి ధర పలికినప్పుడు విక్రయిస్తున్నారు. ఎంతో కష్టపడి గిరిజనులు చింతపండు సేకరిస్తున్నా గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు.

చింతపండు కొనుగోలు ప్రారంభిస్తాం..

గుమ్మలక్ష్మీపురం గిరిజన సహకార సంస్థ ద్వారా తాడికొండ, గుమ్మ లక్ష్మీపురం, దేరువాడ, దుడ్డు ఖల్లు, నీలకంఠాపురం, వంగర, వలస బల్లేరు, గొరడ, మొండెంఖల్ గ్రామాల్లో చింతపండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. గిరిజనుల నుంచి చింతపండు కొనుగోలు ప్రారంభిస్తాం. తడి చింత పండు కొనుగోలు చేసే ప్రసక్తే లేదు. జిసిసి నిర్ణయించిన ధర రూ.32.40పైసలు. ఈ ఏడాది 100 టన్నులు కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నాం.

వి.కష్ణ ప్రసాద్
జిసిసి మేనేజర్, గుమ్మలక్ష్మీపురం.

ఎపి సీడ్స్ రైతులకు తీపికబురు

వారం రోజుల్లో ధాన్యం బిల్లుల చెల్లింపు

ప్రజాశక్తి - సాలూరు

ఎపి సీడ్స్ రైతులకు తీపికబురు అందింది. విత్తన ధాన్యం విక్రయించిన రైతులకు ఇంతవరకు బిల్లులు చెల్లించలేదు. దీంతో ఆందోళన చెందిన రైతులు కొద్ది రోజుల క్రితం డిప్యూటీ సిఎం రాజన్నదొరను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. 3వేల మంది రైతులు సుమారు 30వేల క్వింటాళ్ల విత్తన ధాన్యం విక్రయించారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన రైతులు ఎపి సీడ్స్‌కు ఏటా విత్తన ధాన్యం విక్రయిస్తుంటారు. ధాన్యం విక్రయించిన కొద్దిరోజుల్లోనే ఎపి సీడ్స్ సంస్థ రైతులకు అడ్వాన్స్ కింద కొంత మొత్తాన్ని పంపిణీ చేస్తుంది. కానీ ఈసారి అడ్వాన్స్ చెల్లింపులో తీవ్ర జాప్యం కావడంతో రైతులు ఆందోళన చెంది రాజన్నదొరను సంప్రదించారు. దీంతో ఆయన వెంటనే సిఎం జగన్ మోహన్‌రెడ్డికి రైతుల సమస్య గురించి లేఖ రాశారు. అమరావతిలో వున్న రాజన్నదొర సమస్య తీవ్రతను వివరించారు. సిఎం ఆదేశాలతో ఎపి సీడ్స్ సంస్థ రైతులకు అడ్వాన్స్ చెల్లింపులు జరపడానికి సిద్ధమైంది. వారం రోజుల్లో రైతులకు చెల్లించాల్సిన అడ్వాన్స్ మొత్తం రూ.5.33 కోట్లు చెల్లింపు చేస్తామని సంస్థ ఎమ్ డి చెప్పారని రాజన్నదొర ఫోన్‌లో చెప్పారు.



బకాయిలు చెల్లించాలంటూ రాజన్నదొరకు వినతిని అందజేస్తున్న రైతులు

సంధ్యారాణి కుల వివాదంపై హైకోర్టులో కేసు

ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం

న్యాయ సలహాదారు రేగు మహేశ్వరరావు

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుమ్మిడి సంధ్యారాణి ఎస్టీ కాదంటూ ఆదివాసీ వికాస్ పరిషత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర హైకోర్టులో కేసు వేయనున్నట్లు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం న్యాయ సలహాదారు రేగు మహేశ్వరరావు చెప్పారు. సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో సంధ్యారాణి కులవివాదంపై ఆదివాసీ వికాస్ పరిషత్ సంఘం నాయకులు ఫిర్యాదు చేశారని తెలిపారు. మక్కువ మండలం మరిపివలసకు చెందిన అమరాపు శివున్నాయుడు, పార్వతికు జన్మించిన కుమార్తె సంధ్యారాణి అని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే జిన్ని ముత్యాలుకు పుట్టిన సంతానం ఆమె కాదన్నారు. ఆమె ఎస్టీ కాదంటూ ఆధారాలు చూపుతూ గతంలో నాలుగుసార్లు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. 2021 నవంబర్ 8న ఉమ్మడి జిల్లా కలెక్టర్‌కు ఆమె కులవివాదంపై ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టాలని అప్పటి జిల్లా కలెక్టర్ పార్వతీపురం సబ్ కలెక్టర్‌ను ఆదేశించారని చెప్పారు. కులవివాదాలపై ఫిర్యాదులు అందగానే జిల్లా స్థాయి పరిశీలక కమిటీకి విచారణ నిమిత్తం అందజేయాల్సి ఉందన్నారు. అయితే రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అధికారులు విచారణ చేయడంలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రెగ్యులేషన్ యాక్ట్ 16/93 సెక్షన్ 5 ప్రకారం కులవివాదంపై ఫిర్యాదు వస్తే జిల్లా స్థాయి పరిశీలక కమిటీ ద్వారా విచారణ జరిపించాలని చెప్పారు. అందుకే జిల్లా స్థాయి పరిశీలక కమిటీతో విచారణ జరిపించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ రాష్ట్ర హైకోర్టులో కేసు వేయనున్నట్లు రేగు మహేశ్వరరావు చెప్పారు. సమావేశంలో ఆదివాసీ వికాస్ పరిషత్ నాయకులు చెల్లూరి జోగయ్య, మంచాల గంగరాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఫిర్యాదులకు కంట్రోల్ రూం ఏర్పాటు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో వేసవి దృష్ట్యా ఏర్పడే తాగునీటి ఎద్దడి సమస్యలను పర్యవేక్షించేందుకు జిల్లా కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కంట్రోల్ రూంను జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేశామని తెలిపారు. కంట్రోల్ రూం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తుందని ఆయన చెప్పారు. కంట్రోల్ రూంకు సహాయ ఇంజినీర్ ఆర్.బసవరాజు (9100120735) ఇన్ ఛార్జ్ అధికారిగా వ్యవహరిస్తారని చెప్పారు. ఉదయం 6గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విధులు నిర్వహించే సిబ్బంది వివరాలిలా ఉన్నాయి. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు జి.అనూష (9618477479), ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పి వసంత కుమార్ (8500895315), సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎస్ శ్రీనివాస రావు (9493822 074)కు ప్రజలు తాగునీటి సమస్యలు తెలపాలని కోరారు.

జాతీయ లోక్ అదాలత్ 16కు వాయిదా

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

జాతీయ లోక్ అదాలత్ మార్చి 16కు వాయిదా పడిందని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ జరగాల్సి ఉందని అయితే శివరాత్రి కారణంగా వాయిదా వేయడం జరిగిందని ఆయన చెప్పారు. ఈ మేరకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని ఆయన తెలిపారు.

ఆశ్రమ పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకుల సందర్శన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో ఇటీవల టిక్కబాయి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి తాడంగి వంశీ మృతి గల కారణాలను ఎస్ఎఫ్ఐ నాయకులు తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం టిక్కబాయి ఆశ్రమ పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు విద్యార్థులనుద్దేశిస్తూ మాట్లాడుతూ ఇటీవల కాలంలో జిల్లాలో గిరిజన విద్యార్థులు సుమారు ఆరుగురు మృతి చెందారన్నారు. అయినా నేటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, మీకు ఎలాంటి అనారోగ్య సమస్యలున్నా వెంటనే మీ తోటి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గంగారావు మాట్లాడుతూ ఇప్పటికీ విద్యార్థులు అనారోగ్య బారినపడి మృతి చెందుతున్నా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించక పోవడం సిగ్గుచేటన్నారు. ఇంతమంది గిరిజన విద్యార్థులు చనిపోతున్న వారికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా తక్షణమే ప్రతి ఆశ్రమ పాఠశాలలో, గిరిజన సంక్షేమ వసతి గృహంలో ఎఎన్ఎంలను నియమించాలని, ప్రతి నెలా మెడికల్ క్యాంపు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో అధికంగా ఉన్న రక్తహీనత వ్యాధిని నివారించాలని, దోమల కారణంగా విద్యార్థులకు మలేరియా, డెంగీ వ్యాధుల బారినపడకుండా దోమతెరలు విద్యార్థులకు ఇవ్వాలని, మరణించిన విద్యార్థులకు రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

విద్యార్థుల సమస్యలను ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకుంటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యం పట్ల అత్యంత శ్రద్ధ వహించాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి విష్ణు చరణ్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించాలన్నారు. విద్యార్థుల మరణాలు, విద్య, వసతి గృహ నిర్వహణ తదితర అంశాలపై గిరిమిత్ర సమావేశ మందిరంలో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ అనారోగ్యానికి గురయ్యే విద్యార్థులను ఇళ్లకు పంపరాదని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల అత్యంత శ్రద్ధ వహించాలని, అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కాలానుగుణంగా వైద్య పరీక్షలు జరగాలని ఆదేశించారు. వైద్య అధికారులు, సిబ్బందితో సమన్వయం ఉండాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించి ఎస్ఒపి (స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్) విధిగా పాటించాలని చెప్పారు. వసతి గృహంలో విద్యార్థుల ఆరోగ్యం, చదువుకు వసతి గృహ సంక్షేమ అధికారులు, సహాయ గిరిజన సంక్షేమ అధికారులు బాధ్యత వహించాలన్నారు. విద్యార్థుల ఆహార పానీయాలు పరిశుభ్రంగా ఉండాలని, వంట చేసే పరిసరాల పరిశుభ్రత పక్కాగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఆహార తయారీలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండరాదని ఆయన పేర్కొన్నారు. చదువు విషయంలోనూ దృష్టి సారించాలన్నారు. వసతి గృహ విద్యార్థులు దేశంలో నిర్వహించే విద్య, ఉద్యోగ పోటీ పరీక్షల్లో రాణించాలని, అందుకు తగిన తర్ఫీదు ఇవ్వడంలో ఆసక్తి ఉండాలని ఆయన అన్నారు. మంచి మార్గదర్శకం వహించాలని ఆయన సూచించారు. స్టడీ అవర్స్ నిర్వహించడంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. పదో పరీక్షలు, అనంతరం వచ్చే పాలిటెక్నిక్, గురుకులాలు తదితర పరీక్షలు గూర్చి తెలియజేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి ఎం రుక్మాంగధరావు, సహాయ గిరిజన సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

రూట్ సూపర్‌వైజర్లతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాధరావు

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

మార్చి 3న తలపెట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథ రావు అన్నారు. పల్స్‌పోలియో రూట్ సూపర్‌వైజర్లతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. పల్స్ పోలియోపై గ్రామాల్లో విస్తృత స్థాయి ప్రచారం కల్పించాలన్నారు. గ్రామాల్లో దండోరా వేయించడంతో పాటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ, సచివాలయం తదితర ప్రదేశాల్లో పోస్టర్లు, బ్యానర్లు పెట్టాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో వ్యాక్సిన్ వేసే వారి సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని, ప్రతి బూత్‌కు నలుగురు సిబ్బందిని నియమించాలని చెప్పారు. వ్యాక్సిన్ కేరియర్, కోల్డ్ బాక్సలు, ఐస్ ప్యాకులు, రిఫ్రిజిరేటర్లు సిద్ధంగా ఉన్నవి, లేనివి చూడాలని ఆయన ఆదేశించారు. రూట్ సూపర్ వైజర్లు తమ పక్కాగా విధులు నిర్వర్తించడం, చెక్‌లిస్టులు సరిచూడడం, ప్రోఫార్మ నింపడం వంటి అంశాల పట్ల శ్రద్ధ వహించాలని అన్నారు. పోలియో వ్యాక్సిన్ పోటెన్సిపై అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ఐదేళ్లలోపు వయస్సు గల పిల్లలు ప్రతి ఒక్కరికీ మార్చి 3న రెండో పోలియో చుక్కలు వేయాలన్నారు. ఈనెల 3న పోలియో చుక్కలు వేసుకోకుండా తప్పిన వారికి 4,5 తేదీల్లో ఇంటింటికీ సందర్శించి వేయాలని చెప్పారు. సంచార జాతులు, ఇటుక బట్టీలు, మురికివాడలు, దూర ప్రాంతాలలో నివసించే వాటిపట్ల ప్రత్యేక దష్టి సారించాలన్నారు. జిల్లాలో శత శాతం పోలియో చుక్కలు వేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎం.రామారావు, ఆర్‌బిఎస్‌కె ప్రాజెక్టు అధికారి ధవళ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నిలిపేయాలంటూ ఆదేశం

చైర్‌పర్సన్, కౌన్సిల్ సభ్యుల మధ్య వాగ్వివాదం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో అభివృద్ధి పనుల విషయం చైర్‌పర్సన్‌కు, కౌన్సిల్ సభ్యులకు మధ్య వాగ్వివాదం జరగడంతో పనులను నిలిపివేయాలని చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్, 16వ వార్డు వైసిపి కౌన్సిల్ సభ్యులు సంగంరెడ్డి లక్ష్మీపార్వతి, 14వ వార్డు కౌన్సిల్ సభ్యులు, మాజీ చైర్పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవికి మధ్య అభివృద్ధి పనుల విషయంలో వాగ్వివాదం చోటు చేసుకుంది. సమావేశంలో అజెండాలో అంశాలను మున్సిపల్ అధికారి చదివి వినిపిస్తుండగా, ఒకటో అంశంలో పొందుపర్చిన 14వ వార్డుకు చెందిన వరహాలగెడ్డపై కల్వర్టును, ఐదో అంశాల్లో పొందుపర్చిన 16వ వార్డులో సీసీ కాలువ నిర్మాణ అభివృద్ధి పనులను నిలిపివేయాలంటూ చైర్‌పర్సన్ కమిషనర్ పొందూరు సింహాచలంకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా వార్డుల టిడిపి, వైసిపి కౌన్సిల్ సభ్యులు చైర్‌పర్సన్‌తో నేరుగా వాగ్విదానికి దిగారు. గడపగడపకు మన ప్రభుత్వం పర్యటనలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే సమస్యలను గుర్తించి అభివృద్ధి పనులను మంజూరు చేస్తే వాటిని మీరు నిలిపి వేయాలని ఆదేశించడమేమిటని చైర్‌పర్సన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా చైర్‌పర్సన్‌కు 16వ వార్డు కౌన్సిల్ సభ్యులు ఎస్.లక్ష్మీపార్వతికి మధ్య కొంతసేపు మాటల యుద్ధం చోటుచేసుకోవడంతో అధికార, ప్రతిపక్ష పార్టీ కౌన్సిల్ సభ్యులు ఆశ్చర్యానికి గురయ్యారు. సొంత పార్టీకి చెందిన చైర్‌పర్సన్ సభామర్యాద పాటించకపోవడం విచారకరమని తోటి కౌన్సిల్ సభ్యుల మధ్య 16వ వార్డు కౌన్సిలర్ వాపోవడం గమనార్హం. అనంతరం 14వ వార్డు కౌన్సిలర్ ద్వారపు రెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఐదు రోజులకొకసారి కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా జరగడం విచారకరమని, దీనిపై చైర్‌పర్సన్, మున్సిపల్ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న వేసవిలో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతూ వరహాలగెడ్డపై కల్వర్టు కూల్చేందుకు సిద్ధంగా ఉందని, నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించేందుకు టెండర్ పిలిస్తే నిలిపివేయడమేమిటని కౌన్సిలర్ శ్రీదేవి చైర్‌పర్సన్‌ను ప్రశ్నించారు. ఆ ఏరియా కమర్షియల్ ఏరియాను మీ నిధులతోనే కల్వర్టు నిర్మించుకోవాలని సూచించడంతో చైర్‌పర్సన్‌కు కౌన్సిల్ సభ్యులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. సమావేశంలో వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇండుపూరు గున్నేష్, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, పలు వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌తో వాగ్వివాదం చేస్తున్న కౌన్సిలర్ లక్ష్మీపార్వతి

ప్రభుత్వ పాఠశాలల నాశనానికే ఆరేళ్ల నిబంధన : యుటిఎఫ్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఒకటో తరగతిలో చేరాలంటే కనీసం ఆరేళ్లు నిండాలనే నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని కేంద్రప్రభుత్వం ఆదేశాలిచ్చిందని, ఈ నిబంధనల వల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతపడే ప్రమాదముందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు అన్నారు. ఇప్పటికే 2020 నూతన విద్యావిధానం వల్ల, జిఒ 117 వల్ల, 172 మెమో వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య 40 లక్షల నుండి 35 లక్షలకు తగ్గిపోయిందన్నారు. ప్రాథమిక పాఠశాలల వ్యవస్థ నాశనమైందన్నారు. అగ్నికి వాయువు తోడైనట్లు 6 ఏళ్ల నిబంధన అమలు చేస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఎవరూ చేరరని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నాలుగేళ్ల నుంచే పిల్లలను తల్లిదండ్రులు ఎల్‌కెజి, యుకెజి పేరిట ప్రైవేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఐదేళ్ల నిబంధన ఉండడం మూలానే ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లిపోతుంటే, ఇక ఆరేళ్ల నిబంధన పెడితే పాఠశాలలన్నీ ఇక మూతబడడం ఖాయమని అన్నారు. ఈ ఆలోచనను విరమించుకోవాలని, లేనిచో యుటిఎఫ్, తల్లి దండ్రులు, విద్యార్థి సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు.

స్పందనకు పది వినతులు

ప్రజావక్తి - పార్వతీపురం

వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమానికి 10 వినతులు అందాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల జీతాలు, ఆర్థిక అంశాల పట్ల మంగళవారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పది మంది ఉద్యోగుల జీతభత్యాలు, జిపిఎఫ్ తదితర ఆర్థికపరమైన అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, త్వరగా పరిష్కరించాలని కోరారు. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్పందిస్తూ త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి పద్మావతి

ముడి సరుకుల తయారీతో మహిళలకు ఆర్థిక భరోసా

ప్రజాశక్తి - కురుపాం

ముడి సరుకుల తయారీతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ కొంత భరోసా ఉంటుందని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల గాంధీనగర్ వీధిలో న్యూలైఫ్ మినిస్ట్రీ సంస్థ ఆధ్వర్యంలో సేవ్ భారత్ వారి సహకారంతో మహిళలకు ముడి సరుకులు తయారీ విధానంపై జరిగిన శిక్షణా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవడం వల్ల వారు ఇంటి వద్దనే ఉంటూ ముడి సరుకులు తయారుచేసి అవి అమ్మడం వల్ల కుటుంబ పోషణకు కొంత ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. కావున ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, సేవ్ భారత్ జిల్లా సమన్వయకర్త ఎం.భీష్మ, న్యూ లైఫ్ మినిస్ట్రీ సంస్థ ఫౌండర్ ఎం. మురళి, మహిళలు పాల్గొన్నారు.

30మందిని శస్త్ర చికిత్సలకు తరలింపు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని పలు సచివాలయాల పరిధిలో గల జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల్లో నిర్వహించిన కంటి వైద్య శిబిరాల్లో కేటరాక్ట్ (అంతర కుసుమం), టేరిజియం (కొయ్యకండ) లోపం ఉన్న వారిని గుర్తించి ఉచితంగా శస్త్ర చికిత్సల కోసం మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి పుష్పగిరి కంటి ఆసుపత్రి విజయనగరానికి 30మందిని తరలించినట్లు నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరందరికీ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్లజోళ్లు, మందులు సౌకర్యాలు కల్పిస్తున్నామని, శస్త్రచికిత్సలకు వెళ్తున్న రోగులకు చికిత్స అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు ఉమామాహేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టోకు దేవతకు గిరిజనుల పూజలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండ పంచాయతీ ఎగువ తాడికొండలో టోకు దేవతకు గిరిజనులు మంగళవారం పూజలు నిర్వహించారు. గ్రామంలో పిల్లలు, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, పంటలు బాగా పండాలని, ప్రతి ఇంటా సిరిసంపదలు నిండాలని కోరుతూ గిరిజనులు పూజలు నిర్వహించారు. 15 ఏళ్లకొకసారి గ్రామంలో టోకు దేవతకు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గిరిజనులు తెలిపారు.

రీ సర్వేపై సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్‌డిఒ వెంకటరమణ

భూ రీసర్వే వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - భామిని

మండలంలో రెవెన్యూ అధికారులు గ్రామాల్లో చేపట్టిన జగనన్న సమగ్ర భూ రీసర్వే అంశాలు, స్టోన్ ప్లాంటేషన్ ఏ మేరకు నిర్వహించారన్న అంశాలను స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పాలకొండ ఆర్‌డిఒ వి.వెంకటరమణ పరిశీలించారు. రీసర్వే పూర్తి అయిన రెవెన్యూ గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ శత శాతం పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం చేస్తున్న రీ సర్వే క్షేత్ర స్థాయిలో భూ సమస్యలు లేకుండా, భవిష్యత్తులో భూ యజమానుల మధ్య వివాదాలు లేకుండా ఉండేలా జాగ్రత్త వహించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శేఖరం, రెవెన్యూ పరిశీలకులు రాంబాబు వున్నారు.

మరిపల్లిలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

సూపర్ సిక్స్‌తోనే భవిష్యత్తుకు భరోసా

ప్రజాశక్తి - కురుపాం

తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతోనే ప్రజల భవిష్యత్తుకు భరోసా ఉంటుందని జిల్లా కో ఆప్షన్ మాజీ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్ అన్నారు. మండలంలోని మరిపల్లి పంచాయతీలో తొస్తంగి, వంతరగూడా, జొడుమానుగూడా గ్రామాల్లో బాబు షూరిటి భవిష్యత్తు, గ్యారంటీ సూపర్ సూపర్ సిక్స్ పథకాలపై మంగళవారం ఇంటింటికి వెళ్లి గిరిజనులకు అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో కచ్చితంగా తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుక్కు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నడుకూరు, బొడ్లపాడులో జనసేన నాయకులు ఎం.పుండరీకం, జనసేన జానీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు .

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

విద్యార్థుల విద్యాప్రమాణాలను పెంపొందించాలని ఎంఇఒ-1 ఎస్.సింహాచలం ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని కృష్ణపల్లి, కొత్తఊరు, చిన మరికి, పెదమరికి పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. టీచర్ల డైరీలను, లెసన్ ప్లాన్స్ ను తనిఖీ చేశారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఉపాధ్యాయులు డైరీలు, లెస్సన్ ప్లాన్స్, వర్క్ బుక్ కరెక్షన్స్ సిలబస్ ప్రకారం పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులతో తెలుగు, ఆంగ్ల పాఠాలు చదివించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనాభ్యసన సామగ్రి పరిశీలించి, తరగతి గదిలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగించాలని, వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్‌టి అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నోట్స్‌ను పరిశీలిస్తున్న ఎంఇఒ సింహాచలం

'వెలుగె'టు పోయింది?

పనివేళల్లో తలుపులు మూత!

ప్రజాశక్తి - గరుగుబిల్లి

జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న మండలం అన్న విషయం అధికారులకు తెలుసు. అయినా తమను ఎవరు ఏం చేస్తారులే అన్న ధీమో, నిర్లక్షధోరణి ఏమో గానీ పనివేళల్లో కార్యాలయంలో ఉండాల్సిన అధికారులు, సిబ్బంది ఎవరూ లేకపోవడం ఆ కార్యాలయం బోసిపోయింది.

వివరాల్లోకి వస్తే మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయానికి మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తాళం వేసి కనిపించింది. కార్యాలయంలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శమిచ్చారు. ఉన్నతాధికారులు ఎక్కడైనా సమావేశం నిర్వహించినా, ప్రభుత్వ పథకం ప్రారంభించిన సమయంలో సమావేశం నిర్వహిస్తే సిబ్బంది హాజరైనా కనీసం కార్యాలయంలో ఒకరిద్దరైనా ఉండాల్సి ఉంది. అయితే మంగళవారం మండల

కార్యాలయంలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

వైకెపి సిబ్బంది తమను ఎవరు ఏం చేస్తారన్న ధీమాతో ఏకంగా కార్యాలయానికి తాళం వేసి సిబ్బంది మొత్తం బయటకు వెళ్లిన సంఘటన పలువుర్ని ఆశ్చర్యానికి గురి చేసింది. ఇదే సమయం లో వైఎస్ఆర్ ఐకెపి కార్యాయాలనికి వెళ్లిన పలువురు సిబ్బంది ఎవరూ లేకపోవడం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కార్యాలయ పనివేళల్లో ఏకంగా సిబ్బంది మొత్తం తాళం వేసి ఎలా వెళ్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి స్థానిక వైయస్సార్ క్రాంతి పథం అధికారుల పనితీరు మెరుగుపడేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

తలుపులు మూసేసి ఉన్న ఐకెపి కార్యాలయం

ఇలా అయితే మహిళా సంఘాలకు దొరికేదెప్పుడో....

మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట నుండి మూడు గంటల వరకు సిబ్బంది ఎవరూ లేకపోవడం 'ప్రజాశక్తి' ఎపిఎం పి.అప్పలనాయుడును ఫోన్లో సంప్రదించగా తమ సిబ్బంది అంతా గిజబ, నందివానివలస గ్రామాలకు నాలుగో విడత చేయూత కార్యక్రమంలో భాగంగా వెళ్లారని సమాధానమిచ్చారు. అవసరం నిమిత్తం మహిళా సంఘ సభ్యులు వచ్చినట్లయితే వారి పని ఏమౌతుందని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

3న పల్స్ పోలియో విజయవంతం చేయండి

ప్రజాశక్తి - సీతానగరం

మార్చి 3న పల్స్‌పోలియో విజయవంతం చేయాలని సీతానగరం, పెద్ద అంకలం ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారులు పి.పావని, ఎం.రాధాకాంత్ కోరారు. మొదటి రోజు పల్స్ పోలియో ఆయా కేంద్రాల్లో నిర్వహించి నాలుగైదు తేదీల్లో ప్రతి ఇంటికీ వచ్చేసి అక్కడ తప్పు అయిన పిల్లలకు పల్స్ పోలియో వేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కరెంట్ కోత లేకుండా ఎలక్ట్రికల్ అధికారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ ఎస్‌వి రమణ, జి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

మక్కువ : పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ దేవకుమార్ వైద్యాధికారులతో అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వైద్య అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. 0-5ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. గతంలో పోలియో చుక్కలు వేసుకున్న పిల్లలు కూడా ఈసారి కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. సమావేశంలో మక్కువ, శంబర వైద్యాధికారులు పాల్గొన్నారు.

నిధులు మంజూరుపై వైసిపి నాయకుల హర్షం

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని శివరాంపురం వంతెన నిర్మాణానికి రూ.5.85 కోట్లు మంజూరు చేయడంపై వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, సర్పంచ్ జర్జాపు మోహన్‌రావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వారు స్థానిక నాయకులతో కలిసి అసంపూర్తి వంతెనను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ డిప్యూటీ సిఎం రాజన్నదొర చొరవతో వంతెన నిర్మాణానికి మోక్షం కలిగిందని చెప్పారు. సుమారు పదేళ్లుగా ఎనిమిది గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని దృష్టిలో పెట్టుకొని రాజన్నదొర వంతెన నిర్మాణానికి సిఎం జగన్ మోహన్ రెడ్డిని ఒప్పించారని చెప్పారు.

తప్పుడు విమర్శలు తగవు

ప్రజాశక్తి-పాలకొండ

శాసనమండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కళావతిపై కొంతమంది కావాలనే తప్పుడు విమర్శలు చేస్తూ బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఇది తగదని నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, వైస్‌చైర్మన్లు పల్లా ప్రతాప్, రౌతు హనుమంతరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎఎంజి కన్వెన్షన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాలకొండ పట్టణంలో కోట్ల రూపాయల నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేస్తుంటే అసలు అభివృద్ధి పనులే జరగడంలేదని కొంతమంది వ్యక్తులు మాట్లాడడం విడ్డురంగా ఉందని అన్నారు. డంపింగ్ యార్డ్ విషయంలో కూడా తమ నాయకులు ఎంతగానో శ్రద్ధ తీసుకుంటున్నారని, ఈ విషయంపై కొంతమంది వ్యక్తులు మతి లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. భూముల కబ్జాలు విషయంలో ఎక్కడైనా వారి పాత్ర ఉన్నట్లు నిరూపిస్తే చర్చకు సిద్ధమేనని అన్నారు. ఇసుక అక్రమ రవాణా విషయంలో కూడా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఇసుక అక్రమ రవాణాలో వాటా ఉంటే గతంలో దాడులు చేసేవారా అని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, కిల్లారి మోహన్, కొంచాడ అరుణ్, పల్లా భాను తదితరులు ఉన్నారు.

కలిసి పనిచేద్దాం... విజయ ఢంకా మోగిద్దాం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా నియోజకవర్గంలోని టిడిపి అభ్యర్థి విజయానికి కలిసికట్టుగా పనిచేసి అత్యధిక మెజారిటీతో విజయం సాధిద్దామని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. మంగళవారం జగదీష్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని తన అనుచరులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేసి టిడిపి అభ్యర్థిగా ప్రకటించిన బోనెల విజయ్‌చంద్రను ఆహ్వానించి ఆయనకు దుశ్శాలువాకప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కుటుంబంలో వలే చిన్న చిన్న తగాదాలు వచ్చినా, అంతా కలిసికట్టుగా ఉండి పార్టీ గెలుపు కోసం పనిచేద్దామని వారంతా తెలిపారు. పార్టీలో రెండు వర్గాల పేరిట జరుగుతున్న ప్రచారానికి మాజీ ఎమ్మెల్సీ జగదీష్ తెరదించేందుకు కృషి చేశారు. నియోజకవర్గంలోని మూడు మండలాలు, పురపాలక సంఘం పరిధిలోని నాయకులు, కార్యకర్తలు అభిమానులు అంతా కలిసికట్టుగా ఉండి టిడిపి గెలుపు కోసం పనిచేద్దామని వారంతా తెలిపారు. బుధవారం నుంచి అంతా కలిసి కట్టుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించుదామని, అరమరికల్లేకుండా అంతా కలిసికట్టుగా పనిచేసి టీడీపీ అధినేత చంద్రబాబుకు పార్వతీపురం సీటును గెలిపించి గిఫ్టుగా అందజేస్తామని తెలిపారు. పార్టీ గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు తెలిపారు. టిడిపి అభ్యర్థి బోనెల విజయ్‌చంద్ర


విజయచంద్రను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు జగదీష్, చిరంజీవులు

మాట్లాడుతూ ఇంతవరకు జరిగిన చిన్న చిన్న సంఘటనలను మరిచి, అరమరికలు లేకుండా ఉండి కలిసికట్టుగా పనిచేసి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసేందుకు పనిచేద్దామని తెలిపారు. ముగ్గురు కలిసికట్టుగా ఉంటే టీడీపీ గెలుపు సులభమని అక్కడకు వచ్చిన జగదీష్ అనుచర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మూడు మండలాలు, పట్టణ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కొటియా గ్రామాల్లో వైద్యశిబిరం

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని కొటియా గ్రూపు గ్రామాల్లో మెగా వైద్య శిబిరాన్ని ఎఎస్‌పి సునీల్ షరోన్ సాలూరు రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఎఎస్‌పి మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీస్ భాగంగా కొట్టియా గ్రూపు విలేజ్‌లో పోలీస్‌ల ఆధ్వర్యంలో ప్రతి ఏటా వైద్య శిబిరాలు, సామాజిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి కొటియా పరిధిలో గల సుమారు 300 మంది వైద్య పరీక్షలు చేసుకుని మందులను అందజేశామన్నారు. అనంతరం గిరిజనులకు గొడుగులను, యువతకు వాలీబాల్ కిట్లును అందజేశారు. వైద్యశిబిరంలో పాల్గొన్న గిరిజనులకు భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సాలూరు రూరల్ సిఐ బాలకృష్ణ, ఎస్సై వెంకటరమణ, సాలూరు ఏరియా హాస్పిటల్ వైద్యాధికారులు నాగేశ్వరరావు, అనిల్, తోణాం పిహెచ్‌సి వైద్యాధికారి సుజాత, సాలూరు ఫిలడెల్ఫియా హాస్పిటల్ నుంచి ఒప్తోమలజీ సీనియర్ టెక్నీషియన్ శ్యామ్‌బాబు, కోటియా సిఐ నారాయణరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గొయిపాకలో వైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఎస్‌టి గొయిపాకలో ఎల్విన్‌పేట పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో


గిరిజన యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎఎస్‌పి సునీల్ షరోన్

పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. దీర్ఘకాలికంగా షుగర్, బిపి, జ్వరంతో బాధపడుతున్న 150 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, గొడుగులు, యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ, ఎస్‌ఐ బిడ్డిక శివప్రసాద్, పోలీసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని సర్పంచ్ సిస్టు మధుసూదనరావు అన్నారు. మండలంలోని తలవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. గ్రామస్తులు ఆరోగ్యంగా ఉండాలనే ధ్యేయంతోనే ముఖ్యమంత్రి ఆశయానికి అందరూ పనిచేసి ప్రజలు సురక్షంగా ఉండేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.నితీష వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంబరవలసలో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని కంబరవలసలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ వైద్య తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం సరస్వతి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జిలో ...

సీతానగరం : మండలంలోని బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం

సీతానగరంలో రోగులకు తనిఖీ చేస్తున్న వైద్యాధికారి హేమాక్షి

జరిగింది. ఈ సందర్భంగా రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులైన బిపి, సుగర్ పరీక్షలు నిర్వహించే వాడికి మందులను ఇవ్వడం జరిగింది. అలాగే కంటి పరీక్షలు మోకాల నొప్పులుంటే పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.రాధాకాంత్, టి.హేమాక్షి, సునీతతోపాటు వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ రాంప్రసాద్

ఇంటి పన్ను వసూళ్లకు చర్యలు : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

పాలకొండ డివిజన్ పరిధిలోని ఇంటి పన్ను వసూళ్లకు ముమ్మరంగా చర్యలు చేపడుతున్నట్లు డిఎల్‌పిఒ జె.రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం వీరఘట్టంలోని కీర్తిశేషులు డి.జోగులు మాస్టర్ షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. డివిజన్లోనే రూ.80 లక్షల 32 వేల 432 బకాయి ఉందని, ఇంతవరకు రూ.30,93,170 వసూలు చేశారన్నారు. మిగిలిన మొత్తాలను మార్చి మొదటి వారంలో వసూలు చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది నవంబర్ వరకు ట్రెజరీ ద్వారా ఇంటి పన్నులు కట్టడం జరిగిందని, ప్రస్తుతం ఆన్లైన్ ద్వారా ఇంటి పన్నులు కట్టడం వల్ల కొంత జాప్యం జరిగిందని చెప్పారు. ఏది ఏమైనా లక్ష్యం పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని షాపింగ్ కాంప్లెక్స్ మార్చిలో టెండర్లు పిలవాల్సి ఉన్నందున ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనుల కారణంగా మూడు షాపులు మూతపడడంతో పాటు ఒక షాపు రహదారి విస్తరణ పనుల్లో కుదిరించడం వాటిని మేజర్ పంచాయతీ ఇఒ ఫిర్యాదు మేరకు తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. వినియోగదారులకు అనుకూలంగా టెండర్ వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు మేజర్ పంచాయతీ ఇఒ వి.రామచంద్రరావు ఉన్నారు.

రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - మక్కువ

రహదారు భద్రతలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ తరపున మంగళవారం చేపట్టారు. స్థానిక జూనియర్ కళాశాల ములక్కావలసలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ఐదో రోజు క్యాంపు సందర్భంగా ఈ అవగాహన కార్యక్రమం చేపట్టారు. వాహనాలు నడిపేటప్పుడు, రహదారులు దాటేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రిన్సిపల్ మంజుల వీణ తెలిపారు. ముఖ్యంగా యువత రహదారి నాగరికతకు చిహ్నంగా ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల పట్ల గౌరవప్రదంగా మెలగాలని ఈ సందర్భంగా యువతకు సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

తోరికివలసలో భూ అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో కోతాం పంచాయతీ తోరికవలస లో ఉపాధి హామీ చట్టం ద్వారా జరుగుతున్న భూ అభివృద్ధి పనులను ఎంపిడిఒ కె.గీతాంజలి మంగళవారం పరిశీలించారు. పనులు శరవేగంగా పూర్తి చేయాలన్నారు. వేతనదారులకు సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. జాబ్ కార్డు ఉన్నవారికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఆమె వెంట ఎపిఒ సాగర్ తదితరులు ఉన్నారు. అనంతరం మండలంలోని శంబం గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఎంపిడిఒ గీతాంజలి సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాస్ తీసుకున్నారు ప్రణాళిక బద్ధంగా చదివితే ఉత్తీర్ణత తప్పనిసరి అన్నారు. ఉత్తీర్ణతకు కొన్ని మెలకువలు చెప్పారు. పరీక్షకు వెళ్లేటప్పుడు ప్రశాంతంగా వెళ్లాలని, టెన్షన్ పడరాదని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హెచ్.సుందర్రావు తదితరులు ఉన్నారు.

వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ గీతాంజలి

నేరాలు ఘోరాలు

పెళ్లి చూపులకు వెళ్లి వస్తుండగా..

జీపు బోల్తా 25 మందికి గాయాలు

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ విజయరామపురం గ్రామానికి చెందిన గిరిజనులు ప్రయాణిస్తున్న జీపు బోల్తా పడడంతో సుమారు 25 మంది గాయాల పాలయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం విజయరామపురం గ్రామం నుండి మంగళవారం సాలూరు మండలం కొదమ గ్రామానికి సుమారు 40 మంది గిరిజనులు వెళ్లారు. కొదము నుండి తిరిగి విజయరాంపురం వస్తుండగా మార్గమధ్యలో సాలూరు మండలం మోనంగి వద్ద జీపు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో సుమారు 25 మంది గాయాల పాలయ్యారు. వెంటనే గిరిజనులు 108కు సమాచారం అందించారు. 108 వచ్చేలోపు గాయపడిన పలువురిని ఆటోల్లో, ద్విచక్ర వాహనాల్లో 108లో ఆసుపత్రికి తరలించారు. విజయరామపురం గ్రామానికి చెందిన సుబ్బారావు, మోహన్, శ్రీదేవి తీవ్రగాయాల పాలవ్వడంతో మెరుగైన చికిత్స కోసం 108లో సాలూరు సిహెచ్‌సికి తరలించారు.

చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలోని సిరికొండ సమీపాన మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. సీతంపేట నుంచి వస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తులు ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న పాలకొండ మండలం లంబురుకు చెందిన కె.ఉపేంద్ర, సాయికృష్ణ, మోహనరావు అనే వ్యక్తులకు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో పాలకొండ ఏరియా హాస్పిటల్‌కు తీసుకు రాగా, ఉపేంద్ర పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

140 లీటర్ల నాటు సారా పట్టివేత

పాలకొండ : సీతంపేట మండలం మండకు చెందిన ఐదుగురు 140 లీటర్ల నాటుసారాతో పట్టుబడ్డారని ఎస్ఇబి సిఐ శ్రీనివాస్ తెలిపారు. ఓ అజ్ఞాతవ్యక్తి ఇచ్చిన సమాచారంతో దాడులు చేయగా, సవర అనప, సవర ప్రశాంత్, సవర ఏకోబు, సవర శంకర్రావు, సవర శ్రీకాంత్ నుంచి 140లీటర్ల నాటుసారా దొరికిందని, వీరిని అరెస్ట్ చేసి కోర్టు కు తరలిస్తున్నామని తెలిపారు.